నమస్తే తెలంగాణ
# జనగామ
5 | గురువారం 28 మార్చి 2024 | JANAGAON



ఎరగడి పడి దగ్ధమవుతున్న అడవి

## పంకెన-లెంకలగడ్డ అడవుల్లో మంటలు

**అడవి దగ్ధమవుతున్నా పట్టించుకోని అధికారులు**

పలిమెల, మార్చి 27 : పలిమెల రేంజ్ పరిధిలోని అడవి అగ్నికి ఆహుతవుతున్నది. లెంకలగడ్డ బండలవాగు – పంకెన రామ్‌లక్ష్మణ్ చెట్ల వరకు అడవిలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో అడవి మొత్తం మంటలు వ్యాపించాయి. రెండు, మూడు రోజులుగా దగ్ధమవుతున్నా మంటలను అదుపు చేసేందుకు అటవీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పంకెన ఫారెస్ట్ కాంప్లెక్స్‌కు కూతవేటు దూరంలోనే మంటలు ఉన్నా పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంటల్లో విలువైన వృక్ష సంపదతో పాటు వన్యప్రాణులకు హాని కలిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా వాటి నివారణకు ప్రభుత్వం ఫైర్‌లైన్స్, గస్తీ బృందాలను ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. అటవీ గ్రామాల్లో ఎరగడి మంటలపై ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## శిలాఫలకాలకు చీరె కట్టు..



శాయంపేట : పత్తిపాకలో చీరెలతో శిలాఫలకం కనిపించకుండా చుట్టిన దృశ్యం

శాయంపేట, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో గోడలపై సున్నం వేసి రాతలు తొలగించడం, శిలా ఫలకాలకు పాలథిన్ కవర్లు కప్పి కనిపించకుండా చర్యలు తీసుకోవాలి. కానీ పత్తిపాక గ్రామంలో శిలా ఫలకాలకు బతుకమ్మ చీరెలతో ముసుగు వేశారు. పాలథిన్ కవర్లు కప్పాల్సిన శిలా ఫలకాలకు బతుకమ్మ చీరెలను ఎందుకు కట్టారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బతుకమ్మ చీరెలు జీపీలో ఉన్నాయా? పంపిణీ చేయలేదా? దెబ్బతిన్న చీరెలను ఇలా కోడ్ అమలుకు ఉపయోగించారా? అని జనం చర్చించుకుంటున్నారు. మహిళల ఆత్మగౌరవ ప్రతీకలైన చీరెలను ఇలా శిలా ఫలకాలకు కట్టుగా మార్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో శిలా ఫలకాలకు బొంతలను కట్టారు. మరికొన్ని చోట్ల పేపర్లు అతికించారు. శిలా ఫలకాలు కనిపించకుండా చేయడమే లక్ష్యంగా సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

## ప్రాణాలకు తెగించి.. యువకుడిని కాపాడి..

- రైలు కింద పడి యువకుడి ఆత్మహత్యాయత్నం
- హోంగార్డు రవి సాహసాన్ని అభినందించిన పోలీసులు, ప్రజలు

సుబేదారి/ఖిలా వరంగల్, మార్చి 27 : రెప్పపాటులో ఓ హోంగార్డు యువకుడి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని హంటర్‌రోడ్డు రైల్వే ట్రాక్‌పై బుధవారం సాయంత్రం జరిగింది. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు గుర్తు తెలియని యువకుడు రైలు పట్టాలపైకి వెళ్లాడు. అంతలోనే విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు గూడ్స్ రైలు వేగంగా వస్తోంది. ఆ సమయంలో అండర్ బ్రిడ్జి కింద డ్యూటీలో ఉన్న హోంగార్డు రవికి స్థానికులు విషయం చెప్పడంతో, వెంటనే అతడు పరుగెత్తాడు. రైలు యువకుడి దగ్గరికి చేరుకునే లోపే ఒక్క ఉదుటున వెళ్లి పక్కకు లాక్కొచ్చాడు. ఏ మాత్రం పొరపాటు జరిగినా ఇద్దరి ప్రాణాలకు ప్రమాదం ఉండేది.



యువకుడిని పట్టాలపై నుంచి పక్కకు లాక్కొచ్చిన హోంగార్డు రవి

బాధిత యువకుడు హితోవ సోనుది ఉత్తరాఖండ్ కాగా, బతుకుదెరువు కోసం వరంగల్‌లో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబకలహాలతో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలుసుకొని అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రాణాలకు తెగించి యువకుడిని కాపాడిన హోంగార్డు రవి సాహసాన్ని స్థానికులు మెచ్చుకోగా, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ సత్కరించి అభినందించారు. ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్సీ మధుసూదనాచారికి ఎండిన వరిని చూపుతున్న రైతు

# కాంగ్రెస్ పాలనలో రైతుకు కన్నీరే..

**నీళ్లు ఇవ్వక పంటలను ఎండబెడుతున్నరు**

- పచ్చని పంటల్లో పశువులను మేపాల్సి వస్తోంది
- ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి
- లేకపోతే అన్నదాతల పక్షాన ఉద్యమిస్తాం
- ఎమ్మెల్సీ సిరికొండ, మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, మార్చి 27 : కాంగ్రెస్ పాలనలో రైతులు ఎన్నడూ బాగుపడింది లేదని, వారికి ఎప్పుడూ కన్నీరే మిగుల్చుతున్నారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. బుధవారం రేగొండ మండలకేంద్రంతో పాటు చెంచుకాలనీ, తిరుమలగిరి, రంగయ్యపల్లె గ్రామాల్లోని ఎండిపోయిన వరి పంటలను వారు వేర్వేరుగా పరిశీలించారు. రైతులు మైస రమేశ్, వెన్నల శ్యాం, మైస స్వామి, మేకల ఎల్లయ్య, కున్నాటి నారాయణరెడ్డి, సామల లింగారెడ్డితో ఎమ్మెల్సీ సిరికొండ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయామంటూ ఆవేదనతో చెప్పారు. స్పందించిన సిరికొండ అక్కడినుంచే జిల్లా వ్యవసాయ, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పల్లెల్లో కాంగ్రెస్ మూడు నెలల పాలనలో కరువు ప్రాంతాలుగా మారుతున్నాయన్నారు. పంట చేతికొచ్చే సమయంలో సాగు నీరు ఇవ్వకపోవడంతో పశువులను మేపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నడూ సాగునీరు లేక పంటలు ఎండిపోలేదని ఎండాకాలంలో సైతం డీబీఎం-38 కాల్వల ద్వారా సాగునీటితో చెరువులను నింపడం వల్ల బావులు, బోర్లలో నీటిమట్టం పెరిగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ 100 రోజుల పాలనలోనే రైతులు రోడ్డునపడ్డారన్నారు. అయినా వారిని పట్టించుకున్న నాథుడే లేడన్నారు. రేగొండ మండలంలో 250 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టం అంచనా వేసి ఎకరానికి రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల పక్షాన ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణ మాఫీ, ఎకరాకు రూ.15వేలు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ వందరోజులైనా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు లెంకల రాజిరెడ్డి, సామల పాపిరెడ్డి, ఈర్ల సదానందం, సూర నర్సింగరావు, గోపు భిక్షపతి, దగ్గు వెంకటేశ్వర్‌రావు, బండి రమేశ్ పాల్గొన్నారు.



రంగయ్యపల్లెలో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర



ఏటూరునాగారం : అధికారులకు సూచనలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా
- ములుగు జిల్లాలోని ఇన్‌టేక్‌వెల్‌ల పరిశీలన

వెంకటాపూర్/ఏటూరునాగారం/వాజేడు/ములుగు రూరల్, మార్చి 27 : తాగునీటి సరాఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఆర్ డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. బుధవారం ఆయన వెంకటాపూర్, ఏటూరు నాగారం, వాజేడు మండలాల్లో పర్యటించారు. రామప్ప సరస్సు వద్ద ఇన్‌టేక్‌వెల్, ఏటూరునాగారం మండలం రాంనగర్ సమీపంలోని మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్, వాజేడు మండలం పూసూరు గోదావరి బ్రిడ్జి సమీపంలోని ఉన్న మిషన్ భగీరథ ఇంటేక్‌వెల్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఇన్‌టేక్‌వెల్ పనితీరు, నీటి పంపింగ్ వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు సమృద్ధిగా తాగు నీరు అందించాలన్నారు. పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అందులో భాగంగానే ఇన్‌టేక్ వెల్‌లను పరిశీలించినట్లు తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రామప్ప పంప్‌హౌస్ ద్వారా గోవిందరావుపేట, ములుగు, వెంకటాపూర్ మండలాల్లోని 165 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లావ్యాప్తంగా 2,346 బోర్‌వెల్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో తాగునీటి సమస్య లేదని వివరించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్ డబ్ల్యూఎస్ చీఫ్ శ్రీనివాసరావు, ఎస్‌ఈ మల్లేశం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ.. ప్రిన్సిపల్ సెక్రటరీకి స్వాగతం పలికి మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రతిమలను జ్ఞాపిక రూపంలో అందజేశారు.

## కుట్టుమిషన్లు ఇచ్చేదెన్నడో?

**ఆరు నెలలుగా మైనార్టీ స్కూల్లోనే 170 మిషన్లు**

- ఎన్నికల కోడ్, పంపిణీకి అనుమతి పేరుతో కాలయాపన
- గతంలో మైనార్టీ మహిళలకు మంజూరు చేసిన కేసీఆర్ సర్కారు
- పంపిణీకి సిద్ధంగా ఉన్నా పట్టించుకోని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం




కుట్టుమిషన్లను భద్రపరిచిన వరంగల్ శంభునిపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల

వరంగల్, మార్చి 27(నమస్తే తెలంగాణ): మైనార్టీ మహిళల కోసం ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన కుట్టుమిషన్లు ఆరు నెలలుగా మూలుగుతున్నాయి. పంపిణీకి ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని చెప్పిన అధికారులు.. ఇప్పుడేమో సర్కారు నుంచి అనుమతి రావాలంటున్నారు. మైనార్టీ మహిళలకు ఉపాధి కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా వంద శాతం సబ్సిడీపై కుట్టుమిషన్లు అందజేసింది. ఈ నేపథ్యంలో మైనార్టీ బంధు పథకం ద్వారా వరంగల్ జిల్లాలో అర్హులైన మహిళలకు పంపిణీ చేసేందుకు ఆరు నెలల ముందు కుట్టుమిషన్లు మంజూరు చేసింది. రాయపర్తి, పర్వతగిరి, వర్ధన్నపేట, సంగెం, గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం తదితర మండలాల్లోని మైనార్టీ మహిళలకు సుమారు 170కి పైగా కుట్టుమిషన్లు కేటాయించింది. ఒక్కో కుట్టుమిషన్ విలువ రూ.10వేలు ఉంటుంది. లబ్ధిదారుల ఎంపిక జరిగిన తర్వాతే ప్రభుత్వం ఈ కుట్టుమిషన్లను జిల్లాకు సరఫరా చేసింది.

### ఎన్నికల కోడ్‌తో బ్రేక్..

గత సెప్టెంబర్‌లో కుట్టుమిషన్లను మైనార్టీ శాఖ ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఈ మిషన్లలో వందకు పైగా కుట్టుమిషన్లను నర్సంపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో, 70కి పైగా కుట్టుమిషన్లను వరంగల్ శంభునిపేటలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో మైనార్టీ శాఖ అధికారులు భద్రపరిచారు. డిసెంబర్‌లో ఎన్నికల కోడ్ ముగిసింది. అప్పటివరకు వేచిచూసిన లబ్ధిదారులు కోడ్ ముగిసిన తర్వాత మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను కలిశారు. తమ పేర మంజూరైన కుట్టుమిషన్లను అందజేయాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్న కుట్టుమిషన్లను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. కాలం గడిచిపోతున్నా తమకు కుట్టుమిషన్లు అందించకపోవడంతో లబ్ధిదారులు మైనార్టీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులను కూడా కలిశారు. ఇలా ఎన్నిసార్లు మైనార్టీ శాఖ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రభుత్వం నుంచి కుట్టుమిషన్ల పంపిణీకి గ్రీన్‌సిగ్నల్ రావడం లేదని, అనుమతి వచ్చిన వెంటనే సమాచారం ఇస్తామనే సమాధానమే అధికారుల నుంచి వస్తున్నదని లబ్ధిదారులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉద్దేశపూర్వకంగానే కాలయాపన

తీరా కొద్దిరోజుల క్రితం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున కుట్టుమిషన్లను ఇప్పుడు పంపిణీ చేయలేమని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు లబ్ధిదారులకు చెబుతున్నారు. అర్హులు మాత్రం కేసీఆర్ ప్రభుత్వం తమ పేర మంజూరు చేసిన కుట్టుమిషన్లను పంపిణీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇష్టం లే దని, పంపిణీ చేయకుండా ఉన్న కుట్టుమిషన్ల కోసం ఈ సర్కారు కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసి, వీటిని పంపిణీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసిందంటున్నారు. ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ ప్రభుత్వం తమ పేర మంజూరైన కుట్టుమిషన్లను పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన కుట్టుమిషన్లపై గత ముఖ్యమంత్రి ఫొటోతో కూడిన స్టిక్కర్ ఉందని, ఆ స్టిక్కర్‌ను తొలగించాక ప్రభుత్వం పంపిణీ చేయనుందని మైనార్టీ సంక్షేమ శాఖలోని ఓ అధికారి తమకు చెప్పారని లబ్ధిదారులు కొందరు తెలిపారు. ఏదేమైనా మైనార్టీ మహిళలకు పంపిణీ చేయడానికి గత ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేసిన ఉచిత కుట్టుమిషన్లు ఆరు నెలల నుంచి మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వృథాగా ఉంటుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.


## అప్పులే తిప్పలై..

- రుణదాతల ఒత్తిడిని తట్టుకోలేక దంపతుల ఆత్మహత్య
- మృతులు తమిళ నాడు వాసులు
- ఉపాధి కోసం జనగామలో కుటీర పరిశ్రమతో స్థిర నివాసం



సెల్వరాజ్, భాగ్యలక్ష్మి దంపతులు (ఫైల్)

జనగామ చౌరస్తా, మార్చి 27 : అప్పుల బాధతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన జనగామలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. జనగామ అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన సెల్వరాజు(59), భాగ్యలక్ష్మి(55) దంపతులు. వీరు ఉపాధి కోసం 30 ఏళ్ల క్రితం జనగామ పట్టణానికి వలస వచ్చారు. ఇక్కడి గ్రెయిన్ మార్కెట్ ఏరియాకు సమీపంలోని రైల్వే చిన్నమోరీ వద్ద నివాసం ఉంటున్నారు. ఇక్కడే కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నారు. పాపుడాలు, ఆలూ చిప్స్, లడ్డూలు, మిక్చర్ వంటి తినుబండారాలు తయారు చేసి చుట్టుపక్కల ప్రాంతాలైన బచ్చన్నపేట, చేర్యాల, సిద్దిపేట పట్టణాల్లోని కిరాణం అండ్ జనరల్ స్టోర్ దుకాణాలకు టాటా ఏస్ వాహనాల్లో సరఫరా చేసేవారు. వీరికి ఇద్దరు కుమారులు పళనిస్వామి, చిన్నస్వామి, కూతురు నాగజ్యోతి ఉన్నారు. వీరి వివాహాలు జరిగాయి. కూతురు తమిళనాడులో ఉంటుండగా, కుమారులిద్దరూ ఇక్కడే వేరుగా ఉంటున్నారు. వ్యాపార నిర్వహణ కోసం వీరు బ్యాంకులో రూ.15లక్షల రుణం తీసుకున్నారు. అలాగే పరిచయస్తుల వద్ద సుమారు రూ.30 లక్షల వరకు అప్పు చేసినట్లు సమాచారం. ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో సెల్వరాజ్, భాగ్యలక్ష్మి దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి వీరి మధ్య మాటామాట పెరిగి క్షణికావేశంలో పెట్రోల్, డీజిల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ దామోదర్‌రెడ్డి పరిశీలించారు. ఎస్సై సృజన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ రఘుపతిరెడ్డి పేర్కొన్నారు. సెల్వరాజు, భాగ్యలక్ష్మి దంపతులు బలవన్మరణానికి పాల్పడడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటన జనగామలో తీవ్ర విషాదం నింపింది.



దసలిపట్టు గూళ్లను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

**ఇబ్బందులు పడుతున్న దసలిపట్టు రైతులు**

- రెండు నెలలైనా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం
- గతంలో 15రోజుల్లోనే సజావుగా చెల్లింపులు

## ధర తగ్గినా.. పైకం చేతికిరాలే..!

మహదేవపూర్, మార్చి 27 : దసలిపట్టు పంట అమ్మినా సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో సుమారు 300 గిరిజన, గిరిజనేతర కుటుంబాలు ఏన్నో ఏండ్లుగా దసలి పట్టు పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. సమీప అడవిలో పట్టు సాగు చేసి గూళ్లను మండలకేంద్రంలోని సెరికల్చర్ కార్యాలయానికి తరలిస్తారు. వాటిని వేలం ద్వారా అధికారులు వీవర్స్, వ్యాపారులకు విక్రయిస్తారు. సెప్టెంబర్ చివరి వారంలో దసలి పట్టు సాగును ప్రారంభించగా, డిసెంబర్ చివరి వారంలో రైతులు గూళ్లను సేకరించి కార్యాలయానికి తరలించారు. దిగుబడి సుమారు 16 లక్షల గూళ్లు రాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 8న బహిరంగ వేలం నిర్వహించగా వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు. గతేడాది ఒక్కో మేలైన పట్టు గూడుకు రూ.6.60 ధర పలుకగా ఈసారి రూ.4.90 మాత్రమే పలకడం రైతులను నిరాశ కలిగించింది. ధర తగ్గినా రావాల్సిన డబ్బులు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వేలం నిర్వహించిన 10-15 రోజుల్లోనే రైతులకు పంట డబ్బులు అందేవి. ఈ ఏడాది వేలం పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు అందలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే డబ్బులు రావడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సెరికల్చర్ మండల అధికారి సమ్మయ్యను వివరణ కోరగా పట్టు గూళ్ల రీకౌంటింగ్ ప్రక్రియ పూర్తయిందని, సిబ్బంది కొరత వల్లే కొంత ఆలస్యమైందన్నారు. వారంలో మిగతా రైతులందరికీ డబ్బులందేలా చూస్తామన్నారు.

